క్లుప్తంగా

యూటీఎఫ్ మహాసభలకు ఉపాధ్యాయులు



బస్సుకు జెండా ఊపిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఆలీ

నల్లజర్ల: కాకినాడలో జరుగుతున్న యూటీఎఫ్ 17వ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక స్వర్ణోత్సవ సభకు నల్లజర్ల మండలం నుంచి ఆదివారం ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. రాష్ట్ర పూర్వ కౌన్సిలర్ ఆలీ సాహెబ్ యూటీఎఫ్ జెండాను ఊపి బస్సు యాత్రను ప్రారంభించారు. యూటీఎఫ్ మండల నాయకులు పక్రుద్దీన్ ఆలీ అహమ్మద్, ప్రధాన కార్యదర్శి బి.కిశోర్, జిల్లా కార్యదర్శి భవాని, జిల్లా కార్యదర్శి మనోహర కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ మూడు రోజుల కార్యక్రమాలలో మొదటి రోజు ప్రజా చైతన్య సదస్సు, ఉద్యమ సదస్సు జరిగాయని మనోహరకుమార్ తెలిపారు. రెండో రోజు సాహిత్య సదస్సు, మహిళా సదస్సు, మూడో రోజు ప్రతినిధుల సభ, నూతన కార్యవర్గ ఎన్నిక జరుగుతుందన్నారు.

విద్యార్థులకు స్కౌట్స్, గైడ్స్ సర్టిఫికెట్ల ప్రదానం



విద్యార్థులకు స్కౌట్స్, గైడ్స్ అసోసియేషన్ సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఆర్గనైజర్ మణికంఠ

నల్లజర్ల: హిందూస్తాన్ స్కౌట్స్, గైడ్స్ ఆంధ్రప్రదేశ్ శాఖ నిర్వహించిన 5 రోజుల ప్రవేశిక -2 శిక్షణలో పాల్గొన్న సంఘమిత్ర స్కూలు విద్యార్థులకు అసోసియేషన్ సర్టిఫికెట్లు ప్రదానం చేసింది. గతనెల 24న తణుకులో ఈ కార్యక్రమం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 600 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ఆర్గనైజర్ మణికంఠ తెలిపారు. ఈ సర్టిఫికెట్లను పొందిన విద్యార్థులను స్కౌట్స్, గైడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు అభినందించారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం



క్షతగాత్రుడు వెంకట్రావుకు సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

నల్లజర్ల: గ్రామానికి చెందిన దొడ్డిగర్ల వెంకట్రావుకు రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. దాంతో అతడికి మానవత సంస్థ ఆదివారం సాయం అందజేసింది. అతడి మందుల ఖర్చు నిమిత్తం మానవత సంస్థ రూ.5 వేలు ఆర్థికసాయం అందజేసింది. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు ఝాన్సీరాణి, గత్తికొండ వరప్రసాద్, పాతూరి సత్యనారాయణ, ఐడీవీ అప్పారావు, పాకలపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మరమ్మతు పనుల పరిశీలన

నిడదవోలు: రోడ్డు మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధికారులను కోరారు. పట్టణంలోని మున్సిపల్ సాధారణ నిధులు రూ.45 లక్షల వ్యయంతో చేపట్టిన ప్రధాన రోడ్ల మరమ్మతు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు కారింకి నాగేశ్వరరావు, ఎండీ షాకీరాబేగం, ముంగండి మాణిక్యమాల, చిలకల శారదాదేవి, మానుపాటి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు : సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక రాయిపేటలోని సందీప్ ఆటో ఫైనాన్స్ ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వేసిన సంక్రాంతి ముగ్గులు చూపరులను అలరించాయి. టీడీపీ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణలు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, కూటమి నాయకులు కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగా రమేష్, తిరపతి సత్యనారాయణ, కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, వెంగళరావు, పైడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన పడవ ర్యాంపులు

- గత నెలాఖరుతో ముగిసిన అనుమతులు
- పొడిగింపు ఉత్తర్వులు రాక ఇసుక తవ్వకాల నిలిపివేత
- వేలాది పడవ కార్మికుల ఉపాధికి విఘాతం
- కదలని ఇసుక రవాణా వాహనాలు



తవ్వకాలు లేని కొవ్వూరులోని ఏరినమ్మ బోట్స్‌మన్ ర్యాంపు. ఖాళీగా ఉన్న పడవలు, లోడింగ్ యంత్రాలు



కొవ్వూరు మండలం వాడపల్లి బోట్స్‌మన్ ర్యాంపులో ఇసుక నిల్వలు, పడవలు

కొవ్వూరు: డివిజన్‌లో పడవల ద్వారా నడిచే ఇసుక ర్యాంపులన్నీ మూతపడ్డాయి. ఈ తరహా ర్యాంపులకు డిసెంబర్ నెలాఖరు వరకూ అనుమతులిస్తూ సెప్టెంబర్‌లో అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ర్యాంపులకు ముగిసిన గడువును పొడిగించడంలో కూటమి సర్కారు మీనమేషాలు లెక్కిస్తోంది. గత నెలాఖరుకు గడువు ముగుస్తుందని తెలిసినప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. వేలాది మంది ఉపాధితో ముడిపడి ఉన్న ఇసుక ర్యాంపులు ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. ర్యాంపుల్లో వేలాది టన్నుల ఇసుక నిల్వలున్నాయి. బోట్స్‌మన్ సొసైటీల ఆధ్వర్యంలో నడిచే ర్యాంపులను కూడా నిర్వహణ ఏజెన్సీలకు అప్పగిస్తారనే ప్రచారం సాగుతోంది. దాంతో బోట్ల యజమానులు, కార్మికులు ఆందోళన చెందుతున్నారు. కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లో ఏడు డీ సిల్టేషన్ ర్యాంపులు నడిచేవి. అవి వాడపల్లి, ఔరంగాబాద్-1,2, దండగుండరేవు-1,2, ఏరినమ్మ, కొవ్వూరు ర్యాంపులు. ఈ ఏడు ర్యాంపుల్లో 300కి పైగా బోట్లు పని చేసేవి. ప్రత్యక్షంగా, పరోక్షంగా వాటిపై ఆధారపడి సుమారు 10 వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. డివిజన్ పరిధిలో సుమారు రెండు వేల లారీలు నిత్యం ఇసుక రవాణా చేస్తున్నాయి. ఈ విధంగా కూడా ఎందరికీ ఉపాధి లభిస్తోంది. ఇప్పుడు ర్యాంపులు మూతపడడంతో పడవ కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావం పడింది. జిల్లావ్యాప్తంగా రెండు లక్షల మంది భవన నిర్మాణ రంగ కార్మికుల ఉపాధి కూడా ఇసుక సరఫరాపైనే ఆధారపడి ఉంది. ఇంతమంది కార్మికుల ఉపాధితో ముడిపడిన ర్యాంపుల పట్ల కూటమి సర్కారు శ్రద్ధ చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది.

డ్రెడ్జింగ్‌కి రంగం సిద్ధం?

వేలాది మంది ఉపాధితో ముడిఉన్న బోట్స్‌మన్ ర్యాంపుల్లోనూ డ్రెడ్జింగ్ చేయించాలన్న యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. బోట్స్‌మన్ ఇసుక ర్యాంపులను సైతం కాంట్రాక్ట్ పద్ధతిలో నిర్వహణ సంస్థలకు అప్పగించి దండుకోవాలనేది ప్రభుత్వ పెద్దల యోచన. యంత్రాలను వినియోగించి డ్రెడ్జింగ్ ద్వారా ఇసుక సేకరిస్తే పడవ కార్మికులు పూర్తిగా ఉపాధి కోల్పోతారు. అందుకే కొన్నేళ్లుగా వాడపల్లి, ఔరంగాబాద్ ప్రధాన ర్యాంపుల్లో డ్రెడ్జింగ్‌ను వ్యతిరేకిస్తున్నారు. ర్యాంపులకు ఇచ్చిన గడువు ముగియడంతో నిర్వహణ బాధ్యతను బోట్స్‌మన్ సొసైటీల స్థానంలో కాంట్రాక్ట్ సంస్థకు అప్పగిస్తారని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇందుకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. ఇదే జరిగితే బోట్స్‌మన్ ర్యాంపులు తెరుచుకోవడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే బోట్స్‌మన్ సొసైటీల నాయకులు జిల్లా కలెక్టర్‌ను కలసి తమగోడు వెళ్లబుచ్చుకున్నారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీ శని లేదా సోమవారం సమావేశమై ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ఓపెన్ రీచ్‌ల అనుమతులు 9.. నడిచేవి మూడే

డివిజన్‌లో తొమ్మిది ఓపెన్ రీచ్‌లకు అనుమతి ఇచ్చారు. వాటిలో యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేస్తున్న నిడదవోలు మండలం జీడిగుంట ర్యాంపును మూసి వేశారు. తీపర్రు-2,3 ర్యాంపులు రెండింటినీ పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లో ప్రభుత్వ పనుల నిమిత్తం కేటాయించారు. కుమారదేవంలో 1,2 ర్యాంపులకు అనుమతిచ్చారు. గోదావరి నదిలో నీరు అధికంగా ఉండడంతో ఈ రెండు ర్యాంపులూ ఇంకా తెరుచుకోలేదు. చిడిపి ర్యాంపు వద్దా ఇదే పరిస్థితి. ఇక ప్రస్తుతం పెండ్యాల-కానూరు, పందలపర్రు ర్యాంపులతో పాటు బల్లిపాడు ర్యాంపులు నడుస్తున్నారు. ప్రధానంగా పెండ్యాల, పందలపర్రు ర్యాంపుల్లో స్థానిక వాహనదారులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి ఇసుక కోసం వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మళ్లీ ఇసుక ధరలకు రెక్కలు?

ఇసుక కష్టాలు మళ్లీ మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. డివిజన్‌లో ఏడు డీ సిల్టేషన్ ర్యాంపులతో పాటు మరో తొమ్మిది ఓపెన్ ర్యాంపులున్నాయి. వాటిలో బోట్స్‌మన్ ర్యాంపులు పూర్తి మూతపడగా, ప్రస్తుతం కేవలం మూడు ఓపెన్ ర్యాంపులే నడుస్తుండడంతో ఇసుక ధరలకు మళ్లీ రెక్కలొచ్చే అవకాశం ఉంది. ఇసుకకు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించే అవకాశం ఉంది.

> **ఒకటి, రెండు రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు**
>
> 
>
> బోట్స్‌మన్స్ సొసైటీల ఇసుక ర్యాంపులను ఒకటి, రెండు రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రెన్యువల్ ప్రక్రియపై ఇరిగేషన్, మైనింగ్ శాఖల అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం. ఇసుక తవ్వకాలకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. సాధ్యమైనంత తొందరలోనే ర్యాంపులు తెరిపించేందుకు ప్రయత్నిస్తాం.
>
> – రాణి సుస్మిత, ఆర్డీవో, కొవ్వూరు

రేషన్ డిపో డీలర్ల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

పెరవలి: మండలంలో ఖాళీలు ఏర్పడ్డ 6 రేషన్ డిపోలకు డీలర్ల ఎంపిక కోసం ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు చేసుకోవాలని కొవ్వూరు ఆర్డీఓ ప్రకటించినట్లు తహసీల్దార్ డి అచ్యుత కుమారి తెలిపారు. మండలంలోని లంకమాలపల్లి ఓసీ, ఎన్‌వీపాలెం బీసీ ఏ ఉమెన్, కడింపాడు ఎస్టీ మహిళ, పెరవలి బీసీ బీ మహిళ, పెరవలి ఓసీ, ముక్కామల ఎస్సీ మహిళకు కేటాయించినట్లు చెప్పారు. రిజర్వేషన్ దామాషా ప్రకారం అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో యూత్ కమిటీ సభ్యులు

చాగల్లు: మండలంలోని బ్రాహ్మణగూడెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ఆయన అడుగుజాడల్లో యువత నడవాలని పలువురు వక్తలు ప్రసంగించారు. పాఠశాల విద్యాకమిటీ ఆధ్వర్యంలో దాత సహకారంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అత్యూరి దొరయ్య, టీడీపీ నాయకులు గారపాటి బాబురావు, గారపాటి శ్రీనివాస్, ప్రత్తిపాటి సుబ్బారావు, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు, అంబేడ్కర్ యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ



సుబ్బరాయపురంలో బాధితులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత, వైఎస్సార్ సీపీ నాయకులు

దేవరపల్లి: ధుమంతునిగూడెం పంచాయతీ పరిధిలోని సుబ్బరాయపురంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన మూడు బాధిత కుటుంబాలను ఆదివారం సాయంత్రం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గం ఇన్‌చార్జి తానేటి వనిత పరామర్శించారు. జరిగిన ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు. మంటల్లో చిక్కుకుని సురక్షితంగా తల్లి ఒడికి చేరిన చిన్నారిని ఆమె ఎత్తుకుని ముద్దాడారు. బాధితులు చాపల చంద్రమ్మకు రూ.10 వేలు, మందా రామారావు కుటుంబానికి రూ.5 వేలు, మందా నిర్మల కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మూడు కుటుంబాలకు 75 కిలోల బియ్యం అందజేశారు. బాధితులకు ప్రభుత్వం ఆదుకోవాలని, పక్కా గృహాలు మంజూరు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట ఎంపీపీ కేవీకే దుర్గారావు, మండల పార్టీ కన్వీనర్ కూచిపూడి సతీష్, ఎంపీటీసీ సభ్యులు సత్తి జగదీశ్వరరెడ్డి, కరుటూరి నిత్యానందం, కడలి చిట్టిబాబు, కృష్ణంపాలెం గ్రామ కమిటీ అధ్యక్షులు సత్తి సాయిఈశ్వరరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు కడలి హైమావతి, ఉప సర్పంచ్ మెంటెం మరియమ్మ, పచ్చా రాంగోపాల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

9న బహిరంగ వేలం నిర్వహణ

చాగల్లు: ఏపీ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) చాగల్లు డిపో పరిధిలోని ప్రభుత్వ మద్యం షాపులకు సంబంధించిన వివిధ వస్తువులకు ఈ నెల 9వ తేదీన బహిరంగ వేలం వేయనున్నారు. ఈ విషయాన్ని ఏపీ ఎస్‌బీసీఎల్ చాగల్లు ఇన్‌చార్జి డిపో మేనేజర్ ఎం. కృష్ణదాస్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఏపీ ఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో చాగల్లు శివారులోని డిస్టలరీ కాంపౌండ్ వద్ద గల గోడౌన్ నందు వేలం జరుగుతుందన్నారు. ఈ వేలంలో 111 షాపులకు సంబంధించిన ఫ్రీజర్లు, ఇన్వర్టర్ మరియు బ్యాటరీలు, కాష్‌చెస్టులు, స్కానర్లు, క్యాష్ కౌంటింగ్ మెషీన్లను వేలం వేయడం జరుగుతుందన్నారు. ఎక్కడెక్కడ వస్తువులు అందుబాటులో ఉన్నాయో అక్కడే వేలం ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు నకలు సమర్పించి, దరఖాస్తు రుసుం రూ.5 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. పాట పాడుకోని ఎడల దరఖాస్తు రుసుమును తిరిగి చెల్లిస్తారన్నారు. పూర్తి సమాచారం కోసం 99493 51050 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

మానవత ఆర్థిక సహాయం



దివ్యాంగుడికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మానవత సభ్యులు

గోపాలపురం: కోమటికుంట గ్రామానికి చెందిన పెనబోయిన బాల గంగరాజుకు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు తొలగించారు. మండల మానవత సభ్యులు స్పందించి, బాధితుడికి ఆదివారం రూ.7 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, మానవత అధ్యక్షుడు పప్పు సత్యకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై వార్డు సభ్యుల ఆందోళన

దేవరపల్లి: మండల కేంద్రమైన దేవరపల్లిలో పారిశుధ్య నిర్వహణపై వార్డు సభ్యులు ఆందోళన నిర్వహించారు. గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యాన ఆదివారం చెత్త తొలగింపు కార్యక్రమం చేపట్టి, డంపింగ్ యార్డుకు తరలించే పనికి శ్రీకారం చుట్టారు. జేసీబీతో చెత్త తొలగించి ట్రాక్టర్లపై తరలిస్తుండగా.. పారిశుధ్యం సక్రమంగా చేపట్టాలని డిమాండు చేస్తూ పలువురు వార్డు సభ్యులు ఆందోళన చేపట్టారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రవికిషోర్‌ను వివరణ కోరగా.. గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు క్రమ పద్ధతిలో చేపడుతున్నామని తెలిపారు.

హైందవ శంఖారావానికి తరలిన భక్తజనం

కొవ్వూరు: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడ కేసరపల్లిలో ఆదివారం నిర్వహించిన హైందవ శంఖారావం బహిరంగ సభకు కొవ్వూరు నుంచి భారీగా జనం తరలి వెళ్లారు. కొవ్వూరు నుంచి నాలుగు, మద్దూరు, కుమారదేవం, పశివేదల గ్రామాల నుంచి రెండేసి బస్సులు చొప్పున మొత్తం పది బస్సుల్లో హిందువులు స్వచ్ఛందంగా వెళ్లారు. హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి, రక్షణ కల్పించాలని కోరుతూ నినాదాలు చేశారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ హిందుత్వం అనేది మతం కాదని, భారతీయ జీవనం విధానం అని అన్నారు. హిందువుల ఐక్యతను చాటి చెప్పడంతో పాటు దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని పాలకులను కోరడం ఈ సభ ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు.

చాగల్లు: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన హైందవ శంఖారావం సభకు చాగల్లు మండలం నుంచి అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు లింగాల శ్రీనివాస శర్మ చాగల్లులో ఆదివారం మాట్లాడారు. హిందు దేవాలయాల రక్షణ కోసం చేపట్టిన ఈ సభకు మండలం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆరు బస్సుల్లో తరలి వెళ్లినట్లు చెప్పారు.



కొవ్వూరు నుంచి హైందవ శంఖారావం సభకు తరలి వెళుతున్న హిందువులు

హైందవ శంఖారావానికి 28 బస్సులలో పయనం

నల్లజర్ల: విజయవాడలో ఆదివారం జరిగిన హైందవ శంఖారావం కార్యక్రమానికి మండలం నుంచి 28 బస్సులలో దాదాపు 1,500 మంది కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. ఈ యాత్రను నల్లజర్ల భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మండల శాఖ అధ్యక్షుడు కందుల రవి, సమరసత సేవా ఫౌండేషన్ కొవ్వూరు డివిజన్ కార్యదర్శి ఉప్పలపాటి మాధవరావు, మండల మహిళా అధ్యక్షురాలు ఆలపాటి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి వేడుకల్లో కోడిపందాలు వేస్తున్న మహిళలు

- ఉట్టిపడిన పల్లె వాతావరణం
- ఆకట్టుకున్న మహిళల నృత్యాలు
- బహుమతుల అందజేత

దేవరపల్లి: ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యాన స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం ముందస్తు సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. శ్రీవాసవీ ఆర్యవైశ్య మహిళా సంఘం, ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘాల ఆధ్వర్యాన సంయుక్తంగా ఈ సంబరాలు నిర్వహించారు. సంక్రాంతి సంప్రదాయ క్రీడ అయిన కోడిపందాలను మహిళలు నిర్వహించి సంబరాలను ప్రారంభించారు. పల్లె వాతావరణం ఉట్టిపడేలా వివిధ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. పూరి గుడిసె, గొబ్బెమ్మలు, బొమ్మల కొలువు, భోగి మంట, భోగి పళ్లు, పాల పొంగుల ప్రదర్శనలు, గాలిపటాలు ఎగురవేయడం, సంక్రాంతి పిండివంటలు వంటివి విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆరేళ్లుగా ప్రతి ఏటా ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. సంబరాల్లో ఆర్యవైశ్య కుటుంబాలు పాల్గొని సరదాగా గడిపాయి. ఆర్యవైశ్య మహిళా సంఘానికి స్థానిక గట్టు కాశీ విశ్వనాథం, సుబ్బలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు సత్యనారాయణ, రమాదేవి దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ నిధులపై వచ్చే వడ్డీతో ఏటా సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.



సంబరాల వద్ద ఏర్పాటు చేసిన పూరిపాక

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

గోపాలపురం: వేళ్లచింతలగూడెంలో ఆర్అండ్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహిస్తున్న టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆదివారం నాటికి 10 టీములు పాల్గొనగా వెస్ట్ లెవెల్ టీంపై గోపీ ఫ్రెండ్స్ టీం గెలుపొందింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతిని నిర్వాహకుడు కొర్లపాటి రాజా అందజేశారు. మొత్తం 16 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. ప్రథమ బహుమతి రూ.1.50 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.75 వేలు, తృతీయ బహుమతి రూ.30 వేలతో పాటు బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మన్‌లకు రూ.10 వేల చొప్పున రంగారావు మధు ఫౌండేషన్ చైర్మన్ ఘంటా మధుకృష్ణ బహుమతులు అందజేస్తారని రాజా తెలిపారు.



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతి అందిస్తున్న నిర్వాహకుడు రాజా

13 నుంచి దోసాలమ్మ సంక్రాంతి ఉత్సవాలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామదేవత దోసాలమ్మ అమ్మవారి సంక్రాంతి ఉత్సవాలు ఈ నెల 13వ తేదీ నుంచి 15 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. 13వ తేదీ భోగిరోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం భజన కార్యక్రమం, 14వతేదీ సంక్రాంతి రోజున ప్రత్యేక పూజలు, సాయంత్ర కచేరి, 15వ తేదీ కనుమ రోజున ఉదయం అమ్మవారి పంచలోహ విగ్రహం ఉయ్యాలసేవ, సాయంత్రం ఐదుగంటల నుంచి అమ్మవారి పంచలోహ విగ్రహమూర్తిగా పురవీధులలో భారీ ఊరేగింపు జరుగుతుందన్నారు. 16వతేదీ ముక్కనుమ రోజున భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకోవచ్చన్నారు. 26వ తేదీ ఆదివారం అన్న సమారాధన జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.



బొమ్మూరు గ్రామదేవత దోసాలమ్మ అమ్మవారు

ఈ రోడ్డు కార్పొరేషన్‌దా... పంచాయతీదా?



దుమ్ముతో ఉన్న పెట్రోల్ బంకు నుంచి మల్లయ్యపేట వెళ్లే రోడ్డు

పెట్రోల్ బంకు నుంచి పేపరుమిల్లు క్వార్టర్స్ గేటు వరకు పట్టించుకునేవారే కరవు

రాజమహేంద్రవరం రూరల్: ఈ రోడ్డును నగరపాలక సంస్థ, పంచాయతీలు పట్టించుకోకపోవడంతో ఆ ప్రాంతంలో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఆ రోడ్డు కార్పొరేషన్‌ది అని పంచాయతీ , పంచాయతీ వారిదని కార్పొరేషన్ వదిలేయడంతో అది మట్టి, ధూళితో నిండి ఉంది. ఇదీ రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, కాతేరు పంచాయతీలకు మధ్య ఉన్న రోడ్డు పరిస్థితి. వివరాలు ఇలా ఉన్నాయి. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో పేపరుమిల్లు దాటిన తరువాత పెట్రోల్ బంకు వరకు పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. అక్కడ నుంచి కాతేరు గ్రామపంచాయతీది అని చెప్పి అక్కడ వరకు చేసి వెళ్లిపోతున్నారు. కాతేరు గ్రామపంచాయతీ సిబ్బంది పేపరుమిల్లు క్వార్టర్స్ గేటు వరకు శుభ్రం చేసి అక్కడ నుంచి నగరపాలక సంస్థది అని వదిలేస్తున్నారు. దీనివల్ల పెట్రోల్ బంకు వద్ద నుంచి పేపరుమిల్లు క్వార్టర్స్ గేటు వరకు ఇటు నగరపాలక సంస్థ, గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో దుమ్ము,ధూళితో నిండిపోయింది. ఆ రోడ్డులో వాహనచోదకులు ప్రయాణించాలంటే భయపడిపోతున్నారు. ఆ రోడ్డులో ప్రయాణించే సమయంలో దుస్తులపై దుమ్ముపడి పాడైపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అక్కడ ఉన్న వ్యాపారులు సైతం దుమ్ము వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన నగరపాలక సంస్థ, పంచాయతీ అధికారులు స్పందించి ఆరోడ్డును శుభ్రం చేయించాలని సామాజిక కార్యకర్త పురుషోత్తం కోరుతున్నారు.